కాంగ్రెస్ కౌన్సిలర్‌కు షోకాజ్ నోటీస్

మణికొండ: కాంగ్రెస్ బీఫాంతో గెలిచి పార్టీ మున్సిపల్ చైర్మన్‌కు వ్యతిరేకంగా అవిశ్వాస తీర్మానంపై సంతకం చేసిన కౌన్సిలర్‌కు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా మధుసూదన్‌రెడ్డి షోకాజ్ నోటీసు జారీ చేశారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ఏడో వార్డు కౌన్సిలర్ బి. పద్మారావు గత మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున గెలుపొందారు. ఆ మధ్య అతనిపై పోలీసు కేసు నమోదు కావడం , పదవి పోయేందుకు ప్రస్తుత చైర్మన్ కె. నరేందర్‌ముదిరాజ్ కారణమనే ఉద్దేశంతో హైకోర్టు నుంచి తన పదవిని పునరుద్ధరించుకున్న అనంతరం ఆయనతో దూరంగా ఉంటున్నారు. అందులో భాగంగానే ఇటీవల ప్రతిపక్షాలకు చెందిన కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడంతో అందులో పద్మారావు సంతకం చేశారు. ఆ విషయాన్ని మణికొండ మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం. జితేందర్, కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎస్. ప్రవీణ్‌కుమార్ జిల్లా అధ్యక్షుడి దృష్టికి తీసుకెళ్లారు. దాంతో ఆయన పార్టీ నియమనిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించినందుకు ఈ నెల 14వ తేదీలోపు సంజాయిషీ ఇవ్వాలని లేకుంటే పార్టీ నుంచి సస్పెండ్ చేస్తామని హెచ్చరిస్తూ షోకాజ్ నోటీసు జారీ చేశారు. దానిని ఈనెల 10వ తేదీన పద్మారావుకు అందించినట్టు పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు తెలిపారు.

మార్పులకు అనుగుణంగా పనిచేస్తేనే విజయాలు



సివిల్స్ అభ్యర్థులకు సూచనలు చేస్తున్న రిటైర్ట్ ఐఏఎస్ అనిల్ స్వరూప్

శంషాబాద్: సమాజంలో వచ్చే మార్పులకు అనుగుణంగా పనిచేసినప్పుడే విజయాలు సొంతమవుతాయని రిటైర్డ్ ఐఏఎస్ అనిల్ స్వరూప్ అన్నారు. పట్టణంలోని కృష్ణప్రదీప్ ఐఏఎస్ అకాడమి ఫెస్ట్ కార్యక్రమానికి ఆదివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సివిల్స్‌కు సన్నద్ధమవుతున్న యువత నైతికతకు కంకణబద్ధులై ఉండాలన్నారు. తీసుకునే ప్రతి నిర్ణయం ప్రజాహితంగా ఉండాలన్నారు. రాజకీయ ఒత్తిళ్లు తట్టుకునే సామర్థ్యాలను కూడా పెంపొందించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కేంద్ర విద్యాశాఖ మంత్రిత్వ శాఖలో తాను పనిచేసిన అనుభవాలను వివరించారు. కార్యక్రమంలో వ్యవస్థాపకుడు కృష్ణ ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

వాసవీమాతకు ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న వాసవీ కపుల్స్ క్లబ్ సభ్యులు

మణికొండ: వాసవీమాతా ఆత్మార్పణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మణికొండ వాసవీ వెల్ఫేర్ అసోసియేషన్, వాసవీ కపుల్స్ క్లబ్ ఆధ్వర్యంలో పుప్పాలగూడ కాశీ విశ్వేశ్వరాలయ ఆవరణలో ఆదివారం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకం, కంకుమార్చన పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో వాసవీ కపుల్స్ క్లబ్ అధ్యక్షుడు వి. వంశీకృష్ణ, కార్యదర్శి టి. యశ్వంత్, కోశాధికారి శిరీష, జోన్ చైర్మన్ కె. నిరీష, రీజియన్ చైర్మన్ జి. నవీన్‌కుమార్, రీజియన్ కార్యదర్శి రామ్ సురేశ్, జిల్లా ఇన్‌చార్జి కిరణ్‌కుమార్, వాసవీ క్లబ్ అధ్యక్షుడు యాదగిరితో పాటు సభ్యులు పాల్గొన్నారు.

వాటర్ పైపులైన్ లీకేజీ

మణికొండలో రెండు రోజులుగా తాగునీటికి కటకట

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ పరిధిలో తాగునీటికి కటకట ఏర్పడింది. ఖానాపూర్ రిజర్వాయర్ నుంచి సరఫరా చేసే పైపులైన్ కోకాపేట వద్ద లీకేజీ ఏర్పడడంతో అధికారులు నీటి సరఫరాను నిలిపివేశారు. దీంతో రెండు రోజులుగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు నీటి సరఫరా ఎప్పుడు ప్రారంభమవుతుందో తెలిపే నాథుడే లేకపోవడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఈ విషయమై నీటి సరఫరా చేసే లైన్‌మెన్లకు ఫోన్లు చేస్తున్నప్పటికీ వారు స్పందించకపోవడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో వారు అధికారుల పనితీరుపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. రెండు రోజుల పాటు నీటి సరఫరా లేకపోవడం, స్థానికంగా ట్యాంకర్లు లభించకపోవడం, బోర్లు వట్టిపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పలు కాలనీల ప్రజలు 'సాక్షి'తో వాపోయారు. ఇకనైనా అధికారులు స్పందించి తక్షణమే నీటి సరఫరాను పునరుద్ధరించాలని వారు కోరుతున్నారు.

'జై జవాన్.. జై కిసాన్'కు విరాళం

గవర్నర్‌కు అందజేసిన త్రివేణి విద్యాసంస్థల అధినేత వీరేంద్ర చౌదరి



గవర్నర్ డాక్టర్ తమిళిసైకి విరాళాన్ని అందజేస్తున్న విద్యార్థులు

హఫీజ్‌పేట్ : జై జవాన్.. జై కిసాన్ నిధికి త్రివేణి విద్యా సంస్థల అధినేత డాక్టర్ వీరేంద్ర చౌదరి, పాఠశాలల విద్యార్థులు కలిసి ఆదివారం రాజ్‌భవన్‌లో గవర్నర్ డాక్టర్ తమిళిసైకి విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ సైనికులకు, రైతులకు మద్దతుగా నిలవడం కోసం విద్యార్థులు, విద్యా సంస్థల తరపున రూ.1,00,116ల విరాళం అందజేయడం జరిగిందన్నారు. దేశ రక్షణ కోసం నిరంతరం అప్రమత్తంగా ఉండే సైనికులకు, భారతదేశానికే కాకుండా ప్రపంచ దేశాలకు కూడా ఆహారాన్ని ఇతర పంటలను పండించి నిరంతరం కష్టం చేసే రైతన్నలకు మద్దతు తెలియజేస్తూ ప్రతి సంవత్సరం ఇలాంటి కార్యక్రమాలు చేపడతామన్నారు. అనంతరం గవర్నర్ విద్యార్థులకు మిఠాయిలు పెట్టారని ఆయన తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

హఫీజ్‌పేట్ : కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని శేరిలింగంపల్లి బీజేపీ ఇంచార్జి రవికుమార్ యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని జనప్రియ అపార్ట్‌మెంట్స్‌లో భారత్ వికసిత సంకల్ప్ యాత్ర ద్వారా కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల కోసం ఉజ్వల యోజన, సీఎం స్వనిధి, పేద ప్రజల ఆరోగ్యం కోసం పీఎం సురక్ష బీమా, ఆయుష్మాన్ భారత్, చిరు వ్యాపారుల కోసం ముద్రలోన్, చేతివృత్తుల వారి కోసం విశ్వకర్మ యోజన తదితర పథకాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు.

కమ్యూనిటీహాల్ ప్రారంభం

మియాపూర్ : మియాపూర్ డివిజన్ పరిధిలోని లక్ష్మీనగర్ కాలనీలో రూ.30 లక్షల నిధులతో నిర్మించిన నూతన కమ్యూనిటీహాల్‌ను ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎమ్మెల్యే సీడీపీ ఫండ్స్ రూ.30 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కాలనీలో ఎలాంటి సమస్యలు తలెత్తినా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

'ఆదర్శ స్టేషన్'.. అరకొర వసతులు

అత్యధిక ఆదాయం, ప్రయాణికులు వచ్చే స్టేషన్ ఇదే



లింగంపల్లి రైల్వే స్టేషన్ భవనం

శేరిలింగంపల్లి: సికింద్రాబాద్ నుంచి వాడి వరకున్న రైల్వేస్టేషన్లలో లింగంపల్లి రైల్వే స్టేషన్ అత్యధిక ప్రాధాన్యత కలిగిన స్టేషన్‌గా గుర్తింపు పొందింది. అత్యధిక ఆదాయం, అధిక సంఖ్యలో ప్రయాణికులు ప్రయాణించే స్టేషన్‌గా గుర్తింపు పొందింది. ఈ లింగంపల్లి రైల్వేస్టేషన్ నుంచే చాలా రైళ్లు దూరప్రాంతాలకు బయలుదేరతాయి. అదే విధంగా ఎంఎంటీఎస్ రైళ్ల ద్వారా కూడా ప్రజలు రాకపోకలు సాగించడంతో రోజురోజుకు ప్రయాణికుల సంఖ్య భారీగా పెరుగుతోంది. దీంతో మౌలిక వసతుల కల్పనపై దక్షిణ మధ్య రైల్వే దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు. దక్షిణమధ్య రైల్వే ఉన్నతాధికారులే కాకుండా తాజాగా సౌత్ సెంట్రల్ రైల్వే జెడ్ ఆర్‌యూసీసీ సభ్యుడు డి కాశీనాథ్ లింగంపల్లి రైల్వే స్టేషన్‌ను సందర్శించారు. పలు సమస్యలను ప్రయాణికులు, ఉద్యోగులు వారి దృష్టికి కూడా తీసుకొచ్చారు.

ఈ సమస్యలు పరిష్కరించాలి..

- లింగంపల్లి రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫారం 1, 2 కలుపుతూ ఫుట్‌ఓవర్ బ్రిడ్జిని లిఫ్టులతో చందానగర్ వైపు నిర్మించాలి.
- లింగంపల్లి రైల్వే స్టేషన్‌లోని ప్లాట్‌ఫారం 1 వైపు కార్లు, ద్విచక్ర వాహనాలను పార్క్ చేసేందుకు షెడ్లను నిర్మించాలి. వాహనదారులు పార్కింగ్ కోసం వ్యయం చేస్తున్నప్పటికీ రైల్వేశాఖ షెడ్లు నిర్మించకపోవడంతో అసౌకర్యానికి గురవుతున్నారు.
- లింగంపల్లి స్టేషన్‌లోని 2,3 ప్లాట్‌ఫారంలలో ప్రయాణికులకు షెడ్లు నిర్మించాలి.
- స్టేషన్‌లో వికారాబాద్ వెళ్ళే వైపు ఉన్న ఫుట్‌ఓవర్ బ్రిడ్జికి ప్లాట్‌ఫారం 2, 4 లలో ఎస్కలేటర్లు ఏర్పాటు చేయాలి
- రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల డ్రాపింగ్, పికప్ కోసం 6వ ప్లాట్‌ఫారంలోని పార్సిల్ సెంటర్ సమీపంలో పార్కింగ్ సదుపాయాన్ని ఏర్పాటు చేయాలి. దీంతో రోడ్డుపై ట్రాఫిక్ సమస్య తీరడంతో పాటు ప్రయాణికుల ఇబ్బందులు తొలగుతాయి.
- స్టేషన్‌లో ఉన్న ఫుట్‌ఓవర్ బ్రిడ్జి ఎస్కులేటర్లు 24 గంటలు పనిచేసేలా చూడాలి
- రైల్వే పోర్టర్స్ సంఖ్యను మరింతగా పెంచాలి
- ప్రతి ప్లాట్‌ఫారమ్‌పై దివ్యాంగుల కోసం వీల్‌చైర్స్‌ను అందుబాటులో ఉంచాలి.
- ప్రయాణికుల కొరకు ప్రత్యేకంగా లాక్ రూమ్ ఫెసిలిటీ ఏర్పాటు చేయాలి.
- లింగంపల్లి రైల్వే స్టేషన్ నుంచి బీహెచ్‌ఈఎల్ వరకు బస్ నడపాలి
- స్టేషన్‌కి రావడానికి అప్రోచ్ రోడ్‌ను సౌకర్యవంతంగా తీర్చిదిద్దాలి.



లింగంపల్లి రైల్వే స్టేషన్‌లో 1వ నంబర్ ప్లాట్ పారం వద్ద ఖాళీ స్థలంలో ద్విచక్ర వాహనాల పార్కింగ్



2,3 ప్లాట్ ఫారాలలో షెడ్లు లేని దృశ్యం

ఆటలపై ఆసక్తి తగ్గింది

- సినీ హీరో అల్లరి నరేశ్
- ఐరా స్పోర్ట్స్ హబ్ ప్రారంభం



సోదరుడు ఆర్యన్ రాజేశ్‌తో కలిసి స్పోర్ట్స్ హబ్‌ను ప్రారంభిస్తున్న నటుడు అల్లరి నరేశ్

లక్డీకాపూల్ : ప్రస్తుతం ఆటలపై ఆసక్తి తగ్గిందని, కానీ చిన్నప్పుడు తన సోదరుడితో పోటీ పడి ఆడేవాడినని సినీ హీరో అల్లరి నరేశ్ అన్నారు. మణికొండ ఈవీవీ కాలనీలో ఏర్పాటు చేసిన ఐరా స్పోర్ట్స్ హబ్‌ను తన సోదరుడు ఆర్యన్ రాజేశ్‌తో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నరేశ్ మాట్లాడుతూ తాను ఇప్పటికీ రోజూ గంటపాటు షటిల్ ఆడుతానన్నారు. శారీరక దారుఢ్యాన్ని పెంపొందించుకోవడంతో పాటు మానసికంగా ఉల్లాసంగా ఉండేందుకు క్రీడలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ప్రస్తుతం సిటీల్లో చిన్న చిన్న మైదానాలు కూడా కనిపించడం లేదని, ఇప్పుడు ఇంత పెద్ద స్పోర్ట్స్ ఇక్కడ ఏర్పాటు చేయడంపై నిర్వాహకులను ఆయన అభినందించారు. అనంతరం నిర్వాహకులు మాట్లాడుతూ ఎకరంపైన విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ స్పోర్ట్స్ హబ్‌లో క్రికెట్ నెట్, మల్టీ బాక్స్ క్రికెట్, స్విమ్మింగ్ పూల్, టెన్నిస్‌తో పాటు వీఆర్ గేమ్స్ ఆడేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు అరుణ్ కుమార్, ఇక్బాల్, రాజశేఖర్, కిరణ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అయోధ్యకు మణికొండ వాసులు



యాత్రను ప్రారంభిస్తున్న వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి

మణికొండ: అయోధ్యలోని శ్రీ బాలరాముడిని దర్శించుకునేందుకు మణికొండ నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఆదివారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా మణికొండ మున్సిపల్ వైస్ చైర్మన్ కె. నరేందర్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అయోధ్యకు దేశవ్యాప్తంగా ప్రతిరోజు 3 లక్షలకు పైగా భక్తులు తరలివెళ్తున్నారన్నారు. అయినా ఎలాంటి ఇబ్బందుల్లేకుండా గంటల వ్యవధిలోనే బాలరాముడిని దర్శించుకునేలా పకడ్బందీగా ఏర్పాట్లు చేశారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు జె. సిద్ధప్ప, బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు సి.బీరప్ప, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం. రాఘవరెడ్డి, నాయకులు కేశవాచారి, బి. రవికాంత్‌రెడ్డి, వై. యాదయ్య పాల్గొన్నారు.

రాజేంద్రనగర్ నియోజకవర్గం నుండి ..



రాజేంద్రనగర్ నుంచి అయోధ్యకు బయలుదేరి వెళ్తున్న భక్తులు

రాజేంద్రనగర్: 'శ్రీరామ జన్మభూమి దర్శన్ అభియాన్'లో భాగంగా రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి 200 మంది భక్తులు స్పెషల్ రైల్‌లో అయోధ్యకు ఆదివారం బయలుదేరారు. డైరీ ఫార్మ్ సర్కిల్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నరసింహా రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, జిల్లా కార్యదర్శి ఎం.కొమురయ్య, కార్పొరేటర్ ఎం.సంగీతాగౌరీశంకర్, అసెంబ్లీ కన్వీనర్ పి.మల్లేశ్ యాదవ్, డివిజన్ అధ్యక్షుడు జి.బాబురావు శ్రీరామ చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేయించి భక్తులను సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ వరకు తరలించారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి రాచూరి రాజశేఖర్, బండారి బాలకృష్ణ, ఇ.వేణుగోపాల్, వై.గోపాల్, మల్లేశ్ చారి, వై.అభివన్, వై.సాత్విక్, కిరణ్, పద్మావతి పాల్గొన్నారు.

భార్యతో గొడవపడి ఆత్మహత్య

రాజేంద్రనగర్: భార్యతో గొడవపడి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. దర్గా ఖలీల్ ఖాన్ ప్రాంతానికి చెందిన నరసింహా చారి (60) కార్పెంటర్‌గా పని చేస్తున్నాడు. శనివారం ఉదయం భార్యతో గొడవ పడి బయటకు వెళ్లాడు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఇంటికి వచ్చేసరికి భార్య పనికి వెళ్లింది. దీంతో నరసింహా చారి ఇంట్లోనే ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్కూల్ నుంచి వచ్చిన మనువడు చూసి తన తల్లికి తెలపడంతో విషయం బయటికి వచ్చింది. దీంతో వారు రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు సంఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించి మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

'మనూ'లో ఇద్దరికి పీహెచ్‌డీలు

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఇద్దరు పరిశోధక విద్యార్థినులకు పీహెచ్‌డీలను ప్రకటించారు. విమెన్ స్టడీస్ పరిశోధక విద్యార్థిని నసీమాఖాతూన్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పర్వీన్‌ఖమర్ పర్యవేక్షణలో ' ఇంపాక్ట్ ఆఫ్ కల్చరల్ ప్రాక్టీసెస్ ఆన్ ముస్లిం కమ్యూనిటీ ఇన్ 'మౌ' డిస్ట్రిక్ట్ ఆఫ్ ఉత్తరప్రదేశ్– ఏ జెండర్ ఎనాలిసిస్' అనే అంశంపై థీసిస్‌ను సమర్పించారు. అలాగే హిందీ విభాగంలో పరిశోధక విద్యార్థిని ఉష అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జీవి రత్నాకర్ పర్యవేక్షణలో 'సుశీలా తక్భూరే కే సాహిత్య మే దళిత్‌నారి చేత్నా' అనే అంశంపై థీసిస్ సమర్పించగా ఆమెకు పీహెచ్‌డీని ప్రకటించారు.

జింకపై కుక్కల దాడి

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో జింకపై కుక్కలు దాడి చేశాయి. హెచ్‌సీయూలోని పీహెచ్‌డీ స్కాలర్స్ హాస్టల్ వెనుక శనివారం రాత్రి జింకపై కుక్కలు దాడి చేయడంతో అది తీవ్రంగా గాయపడింది. ఈ ఘటనను చూసిన విద్యార్థులు కుక్కలను తరిమి జింకను క్యాంపస్‌లోని హెల్త్ సెంటర్‌కు తరలించి ప్రాథమిక చికిత్స చేయించారు. ప్రధానంగా హెచ్‌సీయూ క్యాంపస్‌లో భవనాల నిర్మాణం కోసం చెట్లను తొలగిస్తుండడంతో జంతువులు ప్రత్యామ్నాయ ప్రాంతాలకు వెళ్లే క్రమంలో దాడులు జరుగుతున్నాయని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి జంతుజాలం ఉండే ప్రాంతాలను గుర్తించి వాటి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఉచిత వైద్యశిబిరం

హఫీజ్‌పేట్ : మారిన జీవనశైలి వల్ల ప్రజలు వ్యాధులకు గురవుతున్నారని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం హఫీజ్‌పేట్ డివిజన్ మదీనాగూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో సిటిజన్ హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ షకీనా గ్రేసి, డాక్టర్ కృష్ణలు మాట్లాడుతూ వ్యాయామం, మెడిటేషన్, యోగా, ధ్యానం, నడక, కనీసం 40 నిమిషాలు చేయాలన్నారు. సాధ్యమైనంత వరకు తాజా ఆకు కూరలు, సీజనల్ ఫ్రూట్స్, పాలు, పాల ఉత్పత్తులు, చేపలు, గుడ్లు, తృణధాన్యాలు, డ్రై ఫ్రూట్స్ వంటి పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. శిబిరంలో 95 మందికి వైద్య సేవలు అందించారన్నారు. కుమార్‌యాదవ్, బీరప్ప, శ్రీను, రమేష్, కిషోర్, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు సాంబశివరావు, జనార్దన్, అమ్మయ్య చౌదరి, మహేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఒడిశా ఫుడ్, కల్చరల్ ఫెస్టివల్



మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో మూడురోజుల పాటు నిర్వహించిన ఒడిశా ఫుడ్ , కల్చరల్ ఫెస్టివల్ ఆదివారంతో ముగిసింది. హైదరాబాద్‌లో నివసిస్తున్న ఒడిశా ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని సరదాగా గడిపారు. చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేశారు. పసందైన వంటకాలను ఆరగించారు.ఐపీఎస్ సౌమ్యమిశ్ర, సీఈఓ సిద్ధార్థ్ మొహంతి, రహేజాగ్రూప్ సీఎఫ్ఓ గణేశ్ సుబుద్ధి, ఎన్ఎండీసీ మాజీ డైరెక్టర్ నందలు పాల్గొన్నారు. ఒడియా పరివార్ ప్రెసిడెంట్ సస్మితా మిశ్ర కళాకారులను అభినందించారు.

సమ్మెను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్

రాజేంద్రనగర్: ఈ నెల 16న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ పిలుపునిచ్చారు. రంగారెడ్డి జిల్లా కమిటీ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక, రైతాంగ ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నాదన్నారు. కనీస వేతనం రూ.26 వేలు, కార్మిక చట్టాలు, పెరిగిన ధరలకు అనుగుణంగా మార్చుకోవడం, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అనేక అంశాల సాధన కోసం ఐక్యంగా సమ్మెలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్. రాజు, కార్యదర్శి చంద్రమోహన్, ఉపాధ్యక్షుడు రుద్ర కుమార్, సహాయ కార్యదర్శి అలీ దేవేందర్, జిల్లా కమిటీ సభ్యులు ఎస్.మల్లేశ్, ప్రవీణ్ కుమార్, రాములు, చందు, లలిత పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు చేరుకున్న ఉమ్రా యాత్రికులు



శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఉమ్రా యాత్రికులకు స్వాగతం పలుకుతున్న దృశ్యం

శంషాబాద్: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర నుంచి 30 రోజుల కిందట ఉమ్రా వెళ్లిన 70 మంది యాత్రికుల బృందం ఆదివారం ఉదయం హైదరాబాద్‌కు చేరుకున్నది. యాత్రను దిగ్విజయంగా పూర్తి చేసుకున్న వారికి శంషాబాద్ ఎయిర్‌పోర్టులో వారి కుటుంబసభ్యులు, బంధువులు, మిత్రులు పూలమాలలు వేసి స్వాగతం పలికారు. యాత్రను ఫయాజ్ అలీ పర్యవేక్షించారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ, పంచవటి కాలనీలోని శ్రీ లలితా సమేత కామేశ్వర స్వామి ఆలయ ప్రథమ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి బుధవారం వరకు నిర్వహించనున్నట్లు రామాలయం ట్రస్ట్ సభ్యులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మొదటి రోజు ఉదయం 9 గంటలకు ఆలయ ప్రదక్షణ, గణపతి పూజ, అఖండ దీపారాధన, ప్రధాన కుంభ ఆవాహన, మండపారాధన, నీరాజన మంత్ర పుష్పం కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. సాయంత్రం 4 గంటలకు అంకురారోహణ, మూల మంత్ర హోమాలు, ధ్వజా రోహణ, భేరీ, బలిహరణ పూజలు ఉంటాయని, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

బిహార్ ఎమ్మెల్యేల తిరుగు పయనం

శంషాబాద్: హైదరాబాద్ శివారులోని ఓ రిసార్ట్‌లో విడిది చేసిన బిహార్ రాష్ట్రానికి చెందిన 19 మంది ఎమ్మెల్యేలు ఆదివారం సాయంత్రం తిరుగుపయనమయ్యారు. ప్రత్యేక విమానంలో వెళ్లేందుకు శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు రాగా వారి ఫ్లైట్ గంటన్నరకుపైగా ఆలస్యం కావడంతో ఎయిర్‌పోర్టులోనే నిరీక్షించిన అనంతరం సాయంత్రం బయలుదేరి వెళ్లారు.

బేబీ సినిమా

నిర్మాత, డైరెక్టర్‌పై కేసు నమోదు

పేరు మార్చి తన కథను వాడుకున్నారని రచయిత షిరిన్ శ్రీరాం ఫిర్యాదు

గచ్చిబౌలి: బేబీ సినిమా నిర్మాత, డైరెక్టర్లపై రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌లో పైరసీ, చీటింగ్ కేసు నమోదైంది. సీఐ మహేష్ తెలిపిన వివరాల ప్రకారం... రచయిత, సినిమాటోగ్రాఫర్, షార్ట్ ఫిల్మ్స్ డైరెక్టర్ షిరిన్ శ్రీరాం తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్‌లో షిరిన్ శ్రీరాం కేఫ్‌గా బ్యానర్ నమోదు చేసుకున్నారు. తాను రాసిన ఓ కథకు కన్నా ప్లీజ్‌గా నామకరణం చేశారు. తనకు పరిచయమైన సాయి రాజేష్ నీలం అలియాస్ స్టీవెన్ శంకర్ ద్వారా కథను 2017లో అమృత బ్యానర్‌పై 'ప్రేమించొద్దుగా' మార్చారు. అదే కథను 'బేబీ'గా మార్చిన సాయిరాజేష్ ఆ కథ తానే రాశానని నిర్మాత శ్రీనివాస కుమారనాయుడు అలియాస్ ఎస్‌కేఎన్‌కు వివరించారు. 2023 జూలై 14న బేబీ సినిమా విడుదలైంది. బేబీ సినిమా నిర్మాతగా శ్రీనివాస కుమారనాయుడు, దర్శకుడుగా సాయి రాజేష్ నీలం వ్యవహరించారు. తాను రాసిన కథను బేబీగా మార్చి అమ్మి మోసం చేశారని షిరిన్ శ్రీరాం రాయదుర్గం పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. శ్రీనివాస కుమారనాయుడు, సాయి రాజేష్‌లపై ఐపీసీ 420, పైరసీ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

15న ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం

పంజగుట్ట: ప్రత్యేక తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం ఈ నెల 15వ తేదీన లక్డీకాపూల్‌లోని సెంట్రల్ కోర్టు హోటల్‌లో నిర్వహిస్తున్నట్టు ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి, తెలంగాణ ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ గజ్జెల కాంతం ప్రకటించారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ.. కేసీఆర్ తన కుటుంబం బాగుపడేందుకే ఉద్యమకారులను వాడుకున్నారని ఆరోపించారు. గత పదేళ్లలో ఒక్కసారి కూడా ఉద్యమకారులకు అపాయింట్‌మెంట్ ఇవ్వలేదని గుర్తుచేశారు. ఆత్మీయ సమ్మేళనంలో ఉద్యమకారులు ప్రొఫెసర్ కోదండరామ్, స్వామిగౌడ్, అందెశ్రీ, పాశం యాదగిరి, విమలక్క పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో రమేశ్ యాదవ్, సంజీవన్ నాయక్, ఉపేందర్, ఆజాద్, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి బొడ్రాయి, విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు

జియాగూడ: ఈనెల 12 నుంచి జియాగూడ ఇమాంపురాలో బొడ్రాయి నాభిశిల, రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలను వైభవంగా నిర్వహిస్తున్నట్లు నవభారత్ సంఘం అధ్యక్షులు మదిర సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఇమాంపురా ఎన్‌బీఎస్ కమ్యూనిటీహాల్‌లో ఆయన మాట్లాడారు. ఆదివారం సాయంత్రం బొడ్రాయి శిల, రేణుకా ఎల్లమ్మ విగ్రహాల ఊరేగింపు ఇమాంపురాలో కొనసాగుతుందన్నారు. 12న ఉదయం ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం అన్నదానం , 13న యజ్ఞమహోత్సవం, 14న ఉదయం 6 గంటలకు బస్తీవాసులు తమ ఇళ్లల్లో జంటలు బియ్యం పోసుకున్న తర్వాత ఉదయం 7 గంటలకు కమ్యూనిటీహాల్ వద్దకు చేరుకుంటారని బొడ్రాయి నాభిశిల, రేణుకా ఎల్లమ్మ విగ్రహాల ప్రతిష్ఠాపన, బోనాల వేడుకలు, మధ్యాహ్నం అన్నదానం ఉంటుందని వివరించారు. 15న ప్రత్యేక పూజల అనంతరం పుట్టింటి ఆడపడుచులకు కొత్తబట్టలు పెట్టి బియ్యం పోస్తారని, అనంతరం బోనాల ఊరేగింపు ఉంటుందన్నారు.

3కే రన్



3కే రన్‌లో పాల్గొన్న జగదీశ్వర్‌గౌడ్

మియాపూర్: నేడు ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి ఇంచార్జి వి.జగదీశ్వర్‌గౌడ్ సూచించారు. మియాపూర్‌లోని మయూరినగర్ కాలనీలో గుడ్‌డీడ్, రెసొలేషన్ యునైట్ ఆధ్వర్యంలో 3కే రన్‌ను ఆదివారం ఉదయం నిర్వహించారు.ఇందులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ...ప్రతి రోజు యోగా, వ్యాయామం, నడక అలవాటు చేసుకోవాలని సూచించారు. ప్రస్తుత కంప్యూటర్ యుగంలో ఎక్కువగా ఒత్తిడికి గురవుతుంటారని వ్యాయామం తప్పని సరి అని అన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు నారాయణరావు, నాయకులు ప్రసాద్ మధుసూదన్‌రావు, సురేష్, సాంబశివరావు, కిషోర్, వెంకట్‌రావు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9553955684
9010221230